క్లుప్తంగా

గోవిందమ్మకు న్యాయం చేయాలి



గోవిందమ్మకు సంఘీభావం తెలుపుతున్న బీఎస్ఎస్ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: కల్లుకుంట గ్రామంలో బీసీ వర్గాల చేతిలో దాడికి గురైన దళిత గోవిందమ్మకు ప్రభుత్వం న్యాయం చేయాలని బీఎస్ఎస్ నాయకులు కాకర్ల చంద్రశేఖర్, కదిరికోట సునీల్‌కుమార్, రామతీర్థం అమ్రేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో బాధితురాలు చేపట్టిన దీక్షకు వారు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఈఘటనలో ముద్దాయిలందరిపై కేసులు నమోదు చేయాని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

నూతన బస్సు ప్రారంభం



బస్సును రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఆదోని టౌన్: ఆదోని ఆర్టీసీ డిపోలో నూతన బస్సును ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి శుక్రవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఆదోనిలో ఏకంగా 17 బస్సులను ప్రారంభించామని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, ప్రజలకు మెరుగైన ఆర్టీసీ సేవలు అందిస్తామన్నారు.

కార్పొరేట్ రంగ పితామహుడు రతన్‌టాటా



రతన్‌టాటా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో వేదాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం రతన్‌టాటా మృతికి సంతాపం తెలిపిపారు. ఆయన చిత్రపటానికి వేదాస్ సంస్థ డైరెక్టర్ సునీల్‌కుమార్, ఎంపీపీ కేశన్న, రాష్ట్ర శాప్‌నెట్ మాజీ చైర్మన్ మాచాని వెంకటేష్,హైకోర్ట్ న్యాయవాది కాకర్ల చంద్రశేఖర్ తదితరులు పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్పొరేట్ రంగ పితామహుడు రతన్‌టాటా అని ఆయన సేవలను వారు కొనియాడారు. కార్యక్రమంలో ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం నాయకులు ప్రభాకర్, సోమేష్, షఫీవుల్లా, సిసీ డిస్ట్రిబ్యూటర్ భరత్ సాగర్, సందీప్‌కుమార్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

247 దరఖాస్తులు స్వీకరణ



దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎక్సైజ్ సీఐ

ఆదోని టౌన్: ఆదోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 12 మద్యం దుకాణాలకు 247 దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ సీఐ సైదుల్ శుక్రవారం తెలిపారు. శుక్రవారం రాత్రి 11 గంటల వరకు సమయం ఉన్నందున దరఖాస్తులు పెరిగే అవకాశం ఉందన్నారు. ఈనెల 14వ తేదీ లక్కీ డిప్ ద్వారా షాపులు కేటాయింపు జరుగుతుందన్నారు. ఈ నెల 12, 13వ తేదీల్లో దరఖాస్తుల పరిశీలన ఉంటుందని, 14న షాపులు కేటాయించనున్నట్లు చెప్పారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

కోసిగి: ఆదోని రైతు బజారులోని కూరగాయల ధరలకే కోసిగిలో విక్రయాలు జరపాలని.. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ నిత్యానందరాజు తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. వ్యాపారులు దసరా పండుగను ఆసరాగా చేసుకుని ఇష్టరాజ్యంగా కూరగాయల ధరలు అధికంగా పెంచి అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆదోని రైతు బజారులో ఉన్నట్లు ధరల పట్టిక ఉంచాలని తెలిపారు.

కొలిచేవారి కొంగు బంగారం శ్రీలక్ష్మీ చెన్నకేశవుడు!



శ్రీ చెన్నకేశవస్వామి

- నేటి అర్ధరాత్రి నుంచి విగ్రహ మహోత్సవం ప్రారంభం
- స్వామివారిని దర్శించుకునేందుకు తరలిరానున్న భక్తులు

ఎమ్మిగనూరురూరల్: కొలిచేవారికి కొంగు బంగారంగా పూజలు అందుకుంటున్నారు శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి. మండల పరిధిలోని కందనాతి గ్రామం కొండపై వెలసిన స్వామివారు పిలిస్తే పలికే దేవుడిగా పేరొందారు. ప్రత్యేకించి కందనాతి, మసీదపురం, వెంకటగిరి, మాచుమాన్‌దొడ్డి, గ్రామాల ప్రజలు ఆరాధ్యదైవంగా పూజిస్తారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని అర్ధరాత్రి అనంతరం స్వామివారి విగ్రహమహోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. తిరుపతి వేంకటేశ్వరస్వామికి పూజలు జరిగినట్లే శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామికి శరన్న నవరాత్రుల చివరి రోజు వరకు పూజలు చేస్తారు. దసరా సందర్భంగా 12వ తేదీ శనివారం అర్ధరాత్రి దాటాక స్వామివారి విగ్రహ మహోత్సవం ప్రారంభం కానుంది. ఈ మహోత్సవం 13వ తేదీ ఆదివారం ఉదయం తొమ్మిది గంటల వరకు సాగనుంది. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు నాలుగు గ్రామాల పెద్దలు. స్వామివారి విగ్రహాన్ని కడివెళ్లకు వెళ్లేదారి పొలిమేరలో ఉన్న జమ్మిచెట్టు వరకు తీసుకెళ్తారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మరలా కొండ పైకి చేరుస్తారు. విగ్రహమహోత్సవం ప్రశాంతంగా దేవాలయానికి చేరుకుంటే పాడిపంటలతో సంతోషంగా ఉంటారని ప్రజల నమ్మకం. విగ్రహ మహోత్సవాన్ని తిలకించేందుకు జిల్లా వ్యాప్తంగా భక్తులు తరలివస్తారు.

స్వామివారి పల్లకీ మోసే భక్తులు నిష్టతో ఉండాల్సిందే...

స్వామివారిమహోత్సవం సందర్భంగా విగ్రహాన్ని మోసేందుకు భక్తులు ఎంతో నిష్ఠత పాటిస్తారు. కందనాతి, వెంకటగిరి, మసీదపురం, మాచుమాన్‌దొడ్డి గ్రామాలకు చెందిన కొందరు భక్తులు మొక్కుల్లో భాగంగా మూడురోజులపాటు నియమ నిబంధనలు పాటిస్తారు. పూర్తిగా మూడురోజులపాటు దైవ సేవలో ఉంటారు. మంచంపై కూర్చోరు.... పొరకను తాకరు. ఎంతో అవసరం ఉంటే తప్పా భార్యతో మాట్లాడరు. తల్లి చేతి వంటనే భుజిస్తారు. కోపతాపాలకు దూరంగా ఉంటారు. ఈ నియమాలు పాటించకుండా స్వామివారి విగ్రహాన్ని మోస్తే దేవుడు ఏదోవిధంగా శిక్షిస్తారని ఆ నాలుగు గ్రామాల ప్రజల నమ్మకం.



స్వామివారిని ఊరేగిస్తున్న దృశ్యం (ఫైల్)

మహిమగల దేవుడు

శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఎంతో మహిమగల దేవుడు. ప్రత్యేకించి కందనాతి, వెంకటగిరి, మాచుమాన్‌దొడ్డి, మసీదపురం గ్రామ ప్రజల ఆరాధ్యదైవం. కోరిన కోర్కెలు తీర్చేదేవుడైనందునే ఆ నాలుగు గ్రామాల ప్రజలతోపాటు జిల్లా వ్యాప్తంగా భక్తులు ఉన్నారు. స్వామివారి విగ్రహమహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.

– ఎంకయ్య, పూజారి, కందనాతి

జయహో జగన్మాత




మంత్రాలయం: విశేష అలంకరణలో మారెమ్మవ్వ, కోసిగి: కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు




కోసిగి: పల్లకీలో అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు, కోసిగి: కందుకూరులో సిద్ధిదాయినిదేవిగా..



ఎమ్మిగనూరు: అమ్మవారిని రూ.25లక్షల కరెన్సీతో అలంకరించిన దృశ్యం



ఆదోని: దుర్గాదేవిగా..



ఆదోని: అన్నపూర్ణాదేవిగా అంబాభవాని



ఆదోని: తమలపాకు అలంకరణలో లక్ష్మమ్మవ్వ



ఆదోని: ధనలక్ష్మిగా వాసవీమాత



ఆదోని: గాయత్రీదేవిగా గంగమ్మ



మహిషాసురమర్దిని రూపంలో అమ్మవారు

ఆదోని అర్బన్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదోని పట్టణంలో కొలువుదీరిన అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. మహాయోగి లక్ష్మమ్మవ్వ తమలపాకు అలంకరణలో, కరెన్సీ అలంకరణలో ధనలక్ష్మిగా వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి, గాయత్రీదేవిగా గంగాభవాని భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

ఆదోని రూరల్: నెట్టేకల్ దారిలోని దొండు మారెమ్మవ్వ దుర్గాదేవిగా పూజలందుకున్నారు. ఆలయ వంశస్తులు సున్నంబట్టి లక్ష్మన్న, వారి కుటుంబ సభ్యులు పూజల్లో పాల్గొన్నారు. అలాగే జాలిమంచిలో వెలసిన అంబాభవానీ అన్నపూర్ణాదేవిగా భక్తులకు అభయమిచ్చారు.

మంత్రాలయం: కౌతాళం మండలంలోని ఉప్పరహాల్‌లో వెలసిన మారెమ్మవ్వ మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు.అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

-కోసిగి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా వెలసిన సత్యదుర్గాంభిక దేవికి శుక్రవారం కుంకుమార్చన, ఫల, పుష్పాలంకరణ చేసి పూజలు చేశారు. అమ్మవారి ప్రతిమను పల్లకీలో కొలవుంచి మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు. అలాగే మండలంలోని కందుకూరులో వెలసిన శాంభవీదేవి సిద్ధిదాయినిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

ఎమ్మిగనూరుటౌన్: దేవి శరన్నవ రాత్రుల మహోత్సవంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని రూ.25లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు. అదేవిధంగా వీవర్స్‌కాలనీ మైదానంలో ఏర్పాటు చేసిన మండపంలో మహిషాసుర మర్దిని రూపంలో కొలువుదీరిన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

నందవరం : మండలంలో దేవీశరన్నవరాత్రోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య జరుగుతున్నాయి. దక్షిణ కాశీగా పేరు గాంచిన గురజాల రామలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతి దేవి మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు.

ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభించాలని వినతి

ఆదోని సెంట్రల్: ఆదోని ప్రభుత్వ వైద్య కళాశాల పనులను చేపట్టి తరగతులను ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి షబీర్ బాషా, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ డిమాండ్ చేశారు. శుక్రవారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ విద్యా సంవత్సరంలో తరగుతులు ప్రారంభం కావాల్సి ఉండగా అర్థాంతరంగా కళాశాల నిలిచిపోవడం ఆదోని ప్రజానీకం, విద్యార్థులు ఆవేదనకు గురవుతున్నారని తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళం

ఆదోని రూరల్: విజయవాడ వరద బాధితుల సహాయార్థంగా ఆదోని నియోజకవర్గం కాటన్ మర్చంట్ అసోసియేషన్ తరపున సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.3.20 లక్షల విరాళాన్ని శుక్రవారం ఎమ్మెల్యే పార్థసారథికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని అభినందించారు.

ఆయుధ పూజ



నందవరం పోలీస్‌స్టేషన్‌లో ఆయుధ పూజ చేస్తున్న పోలీసులు

నందవరం : మండల కేంద్రం నందవరం పోలీస్ స్టేషన్‌లో దేవి శరన్ననవరాత్రులో భాగంగా 9వ రోజు శుక్రవారం ఆయుధ పూజ నిర్వహించారు. పురోహితులు హంపేష్‌స్వామి నేతృత్వంలో పోలీసులు దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేపట్టారు.

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో శుక్రవారం కార్మికులు, సిబ్బంది ఆయుధ పూజ చేశారు. బస్సులు,యంత్రాలు, పరికరాలకు పూజలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది గంగన్న, మహేశ్వర్‌రెడ్డి, ప్రసాద్, శరణప్ప ,ఎంఎల్ రెడ్డి, సురేష్‌బాబు, బజారప్ప, నాయకులు ముస్తక్‌అహమ్మద్,మదార్ సాబ్, పీఎం బాష తదితరులు పాల్గొన్నారు.

దసరా వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

గోనెగండ్ల: దసరా పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ గంగాధర్ ప్రజలకు సూచించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ భక్తిభావంతో ఉత్సవాలు నిర్వహించుకోవాలని, మద్యం సేవించి అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పండుగను సంప్రదాయ బద్ధంగా జరుపుకోవాలని సూచించారు.

విద్యార్థికి సత్కారం



బోడ సాత్వికను సత్కరిస్తున్న నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: నీట్ ప్రవేశ పరీక్షలో ఉత్తమ ప్రతిభ చాటి మెడికల్ సీటు సాధించిన పట్టణానికి చెందిన బోడా ఈరన్న, కోమలి దంపతుల కుమారుడు బోడా సాతిృక్, వగ్గా సత్యం కూతురు వగ్గా నేహలను శుక్రవారం పట్టణంలో పద్మశాలి బహూత్తమ సంఘం, పద్మశాలి సంఘ నాయకులు ఘనంగా సత్కరించారు. అనంతరం వారికి వెండి మెడల్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు విశ్వనాథ్‌రమేష్, ప్రధాన కార్యదర్శి పోలె వీరప్రసాద్, కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి దోమ భీమేష్, గౌరవాధ్యక్షుడు శాసం శివదాస్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి గుంతలు పూడ్చివేత



ముగతి రహదారిలోని గుంతలు పూడ్చి వేయిస్తున్న సర్పంచ్ విరుపాక్షిరెడ్డి

నందవరం : ముగతి- నందవరం ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. ప్రధాన రహదారి కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్ అండ్ బీ అధికారులు స్పందించకపోవడంతో సర్పంచ్ విరుపాక్షిరెడ్డి చొరువ తీసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం మట్టిని తరలించి గుంతలను పూడ్చివేయించారు. కొంతమేర సమస్యను పరిష్కరించిన సర్పంచ్‌కు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

మంచాలమ్మకు విశేష పూజలు



మంచాలమ్మకు పూజలు చేస్తున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం : దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా గ్రామ దేవత మంచాలమ్మకు విశేష పూజలు చేపట్టారు. శుక్రవారం దుర్గాష్టమిని పురస్కరించుకుని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మంచాలమ్మ సేవలో తరించారు. ముందుగా మంచాలమ్మకు పుష్ప, కుంకుమార్చనలు గావించారు. అనంతరం మహా మంగళహారతులు పట్టి దుర్గామాత అలంకరణ చేశారు. పూజోత్సవాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మంచాలమ్మ దర్శనార్థం భక్తులు, గ్రామస్తులు వేలాదిగా తరలివచ్చారు.

కిక్కిరిసిన వ్యాపార సముదాయాలు

- ముస్తాబైన దేవాలయాలు
- నేడు దసరా పండుగ



ఎమ్మిగనూరు: దసరా పండుగ కోలాహలం మొదలైంది. శనివారం జరిగే దసరా ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు-వ్యాపారాలు చేస్తున్నవారంతా సొంత ఊళ్లకు చేరుకున్నారు. ఆడపచులు, బంధువులు రావడంతో ప్రతి ఇల్లు కళకళలాడుతోంది. ఎమ్మిగనూరు పట్టణంతో పాటు గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు మండలాల్లోని ప్రసిద్ధ దేవాలయాలు పండుగకు ముస్తాబయ్యాయి. శుక్రవారం పండుగ సామగ్రి కొనుగోలు కోసం వచ్చిన ప్రజలతో ఎమ్మిగనూరు పట్టణం కిక్కిరిసి పోయింది. బట్టల దుకాణాలు, టైలర్ షాపులు, కూరగాయల మార్కెట్, పూల బజార్ తదితర దుకాణాలు కొనుగోలు దారుతో నిండిపోయింది.

ముస్తాబైన దేవాలయాలు

దసరా ఉత్సవాల కోసం ప్రధాన దేవాలయాలు, అమ్మవారి ఆలయాలు ముస్తాబయ్యాయి. పట్టణంలోని నీలకంఠేశ్వర, మార్కెండేయ, ఈశ్వరస్వామి దేవాలయాలు, కన్యకా పరమేశ్వరీ, గాయత్రీదేవీ, అంబా భవానీ, సుశీలాంభదేవీ దేవాలయాలను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. అలాగే ఎమ్మిగనూరు మండలంలో చెన్నకేశవస్వామి, నందవరం మండలంలో గురుజాల రామలింగేశ్వర ఆలయాలను ముస్తాబు చేశారు.